ప్రజాశక్తి

గురువారం 28 నవంబరు 2024

రేపు టెలికాం వినియోగదారుల సదస్సు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిఎస్ఎన్ఎల్ సేవలు, వినియోగదారుల హక్కులపై ఈనెల 29న మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కేంద్రంలోని సంచార భవన్‌లో అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ నాయుడు మర్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియాలో నమోదైన కన్స్యూమర్ అడ్వొకేసీ గ్రూపు సభ్యులు పరిశీలకులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆన్‌లైన్ ద్వారా గూగుల్ మీట్ లింకు https: //meet. google.com/pac-dsct-svq ద్వారా హాజరై తమ సమస్యలు, సలహాలు తెలియజేయవచ్చని తెలిపారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత అని కేంద్ర మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణా దేవి అన్నారు. వీటిని నిర్మూలించడమే ప్రధాన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో బుధవారం నిర్వహించిన 'బాల్య వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల విముక్తి భారత్ లక్ష్యమని చెప్పారు. పిల్లలు ఎదగడానికి, వృద్ధి చెందడానికి సురక్షితమైన వాతావరణం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలు నిర్మూలనకు అసాధారణ కృషి చేసిన కొందరు వ్యక్తులు, బాల్య వివాహాలను ఎదుర్కొని విజయం పొందిన ఎంపిక చేసిన తొమ్మిది మంది బాలికలతో వర్చువల్ గా వారి అనుభవాలను ఆమె తెలుసుకున్నారు. ఇందులో ఎచ్చెర్ల మండలం కుంచాల కురమయ్యపేటకు చెందిన బుచ్చ రమణమ్మ తన అనుభవాలను తెలిపారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తనకు 14 ఏళ్ల వయసులో వివాహం చేశారని, సదరు విషయం సమగ్ర బాలల పరిరక్షణ విభాగానికి తెలిసి తన తల్లిదండ్రులకు పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించి వివాహాన్ని రద్దు చేయించారని తెలిపారు. ప్రస్తుతం బిటెక్ చదువు పూర్తి చేసుకుని, ఐటి సొల్యూషన్ కంపెనీ, హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెప్పారు. మరెంతో మంది బాలికలకు తన అనుభవాలను పంచుకుంటూ బాల్య వివాహాల నిర్మూలనకు తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు దేశంలో ఒక పెద్ద సమస్యగా మారిందన్నారు. దీన్ని అధిగమించడానికి అందరి సహకారం అవసరమని చెప్పారు. బాల్య వివాహాల కారణంగా వారి జీవితాల్లో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బి.శాంతిశ్రీ, పిఎ ఎం.మల్లేశ్వరరావు, పిఐఎల్ నాయుడు, వన్ స్టాప్ సెంటర్ కోఆర్డినేటర్ హిమబిందు, పలు కళాశాలల విద్యార్థినులు, బ్రెడ్స్ సచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

బాల్య వివాహాల నిర్మూలనపై నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా మహిళా సంరక్షణ కార్యదర్శికి, పిల్లల సహాయ వాణి టోల్ ఫ్రీ నంబరు 1098 తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, పలు సంఘాల ప్రతినిధులు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే

పడకేసిన 'మడ్డువలస'

లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువలు

మడ్డువలస రెండో దశ పనులకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. పొందూరు మండలంలోని పలు ప్రాంతాల్లో బండరాళ్ల తొలగింపునకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో కాలువ తవ్వకాలు నిలిచిపోయాయి. ప్రాజెక్టు పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ పెద్దగా ఆసక్తి చూపకపోవడం కూడా పనులు ముందుకు సాగకపోవడానికి మరో కారణంగా ఉంది. కాలువ తవ్వకాలకు అధికారులు భూమిని సేకరించినా, రైతులకు డబ్బులు ఇవ్వకపోవడమూ పనులు ఆగిపోవడానికి దారితీసింది. ప్రస్తుతం చేపడుతున్న పనులు పరిశీలిస్తే, నిర్ధిష్ట సమయానికి పూర్తి కావడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి.

- **కాలువ తవ్వకాలకు మైనింగ్ అనుమతులు పెండింగ్**
- **స్ట్రక్చర్ల నిర్మాణాలకు ముందుకు రాని నిర్మాణ సంస్థ**
- **కొత్తగా చేపట్టిన తర్వాత ఐదు శాతమే పూర్తి**
- **జనవరి నాటికి పూర్తి కావడంపై సందేహాలు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లతో పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పి.జె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగునీరు అందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశమిచ్చింది. చివరిసారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎస్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

అడుగడుగునా అవాంతరాలే...

మడ్డువలస పనులను 2009లో ప్రారంభించి 2020 జూలై వరకు 78.36 శాతం జరిగాయి. రెండో దశ పూర్తి కావాలంటే మరో 21.64 శాతం పనులు పూర్తి చేయాలి. మిగిలిన పోయిన పనులను ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించింది. గతేదాది ఏడాది ఏప్రిల్ 24న మడ్డువలస పున:ప్రారంభ పనులకు అప్పటి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేశారు. అప్పట్నుంచి మొదలైన పనులు మందకొడిగానే సాగుతున్నాయి. ఇది చాలదన్నట్లు పనులకు రకరకాల ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పొందూరు మండలం వి.ఆర్ గూడెం, ధర్మపురం, వావిలపల్లిపేట, ప్రాంతాల్లో కాలువ తవ్వకాలకు బండరాళ్ళు అడ్డురావడంతో వాటిని పేల్చి తొలగించాల్సి ఉంది. మైనింగ్ శాఖకు దరఖాస్తు చేసినా ఇంకా అనుమతులు ఇవ్వలేదు. రైతుల నుంచి తీసుకున్న భూములకు రూ.2.25 కోట్లను చెల్లించకపోవడంతో కాలువ తవ్వకాలు ఆగిపోయాయి.

జనవరికి పూర్తి కావడం సందేహమే

మడ్డువలస పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్ నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలిసింది. బిల్లులు వస్తాయో, లేదోనన్న సందేహంతో వెనకడుగు వేస్తుండడంతో పనులు ముందుకు సాగడం లేదు. పది కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉండగా, నాలుగు కిలోమీటర్లు తవ్వారు. కాలువపై 250 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్కటీ నిర్మించలేదు. కొత్తగా పనులు మొదలైన తర్వాత ఐదు శాతం మాత్రమే పూర్తయ్యాయి. కొత్త ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది జనవరిలోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. పనులు జరగుతున్న పరిస్థితి చూస్తే ఆరు నెలల పాటు పొడిగించాల్సి వస్తుందనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

కార్మిక చట్టాలను అమలు చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - మందస

మందస జీడి, రైస్‌మిల్లు కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. మండలంలోని రైస్‌మిల్లు, జీడి పరిశ్రమల కార్మికుల సమావేశాన్ని సారంగిపురంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి, రైస్‌మిల్లుల యాజమాన్యాలు కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయడం లేదని చెప్పారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయకుండా తీవ్ర శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని విమర్శించారు. గత వేతన ఒప్పందం ముగిసి ఆరు నెలలు దాటినా నూతన వేతన ఒప్పందం చేయలేదని చెప్పారు. జీడి, రైస్‌మిల్లుల యాజమాన్యాలు కార్మికులపై నిర్లక్ష్య వైఖరిని వీడి వెంటనే ఒప్పందం చేయాలని, కార్మికుల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లు కార్మికులు బస్తాలు మోసినపుడు నడుం జారినా, యంత్రాల వద్ద ప్రమాదాలకు గురైనా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో కార్మికులకు ఎటువంటి ఆసరా ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు చట్ట ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ, విడిఎ, బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు, డి.లక్ష్మి, కె.ధనలక్ష్మి, బి.భారతి, జి.బాలమ్మ, కె.శాంతమ్మ, సిహెచ్.జానకమ్మ, కె.బాలకృష్ణ, బి.దుర్యోధన, పి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల ఆక్రమణలపై చర్యలు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆలయ భూములు ఆక్రమణకు గురైతే చట్టరీత్యా చర్యలు తీసుకొని స్వాధీనం చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని దేవాదాయశాఖ అసిస్టెంట్ కార్యాలయంలో అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. జిల్లాలోని అనేక పురాతన ఆలయాలకు వందల ఎకరాల భూములున్నాయని, వాటిని క్రమబద్ధీకరించకపోవడం వల్ల పలుచోట్ల ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. అరసవల్లి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమల్లో ఉందని, ప్రసాదం స్కీమ్ ద్వారా అభివృద్ధి నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. అందుకోసం కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు తన వంతు కృషి చేస్తున్నారన్నారు. అరసవల్లిలో ఏటా నిర్వహించే రథసప్తమి వేడుకలకు ఈ ఏడాది ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. రథసప్తమి వేడుకలను ప్రభుత్వ వేడుకగా నిర్వహించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కోరినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. శ్రీకూర్మంలోని శ్వేత పుష్కరిణి, అరసవల్లిలోని ఇంద్ర పుష్కరిణి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. సమావేశంలో అరసవల్లి ఆలయ ఇఒ, దేవాదాయశాక డిప్యూటీ కమిషనర్ వై.భద్రాజీ, దేవాదాయ శాఖ ఎసి ప్రసాదరావు, శ్రీకూర్మం ఆలయ ఇఒ జి.గురునాథరావు, ఇతర ఆలయాల కార్యనిర్వహక అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న బిఎస్ఎల్ఎల్ ఉద్యోగులు

మూడో వేతన సవరణ చేపట్టాలి

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల మూడో వేతన సవరణ తక్షణమే ప్రకటించాలని, పెన్షన్ రివిజన్‌తో పాటు 4జి, 5జి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లపై ఆలిండియా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, ఆలిండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్, క్యాజువల్, కాంట్రాక్టు వర్కర్సు ఫెడరేషన్ సంయుక్తంగా నగరంలోని సంచార్ భవన్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి నుంచి 15 శాతం ఫిట్‌మెంటుతో వేతన సవరణ జరగాల్సి ఉన్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు పదేళ్లకోసారి వేతన సవరణ జరగాల్సి ఉన్నా, 17 ఏళ్లుగా పట్టించుకోవడం లేదన్నారు. పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

మరోవైపు ప్రైవేటు ఆపరేటర్లు వారి సేవలను విస్తరించేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సంస్థ ద్వారా సహకరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు అనువైన పరిస్థితులున్నా 4జి, 5జి సేవలను బిఎస్ఎన్ఎల్ సంస్థ వినియోగదారులకు విస్తరించకుండా సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు ఆపరేటర్లు మొబైల్ టారిఫ్‌లను ఇష్టారాజ్యంగా పెంచుతున్నారని, దీనివల్ల మధ్య, చిన్నతరహా వినియోగదారులకు మోయలేనంత భారం పడుతుందన్నారు. తక్షణమే ఈ సేవలను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సంస్థలో పనిచేస్తున్న క్యాజువల్ కాంట్రాక్టు వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు అభిమన్యు, లక్ష్మి, అరుణ, గోపాలరావు, వెంకటరావు పాణిగ్రహి, చరణ్, డి.శ్రీనివాసరావు, కె.గోపాలరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ రౌలో

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కవిటి

సోంపేట రైల్వేస్టేషన్‌లో మంచినీటి సమస్య, ఎలక్ట్రికల్ సమస్యలు పరిష్కరించాలని జెడ్ఆర్‌యు సిసి సభ్యుడు శ్రీనివాస్ రౌలో కోరారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో బుధవారం నిర్వహించిన వినియోగదారుల కమిటీ సమావేశంలో చీఫ్ కమర్షియల్ మేనేజర్ అజయ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ వద్ద ఉన్న సమస్యలు పరిష్కరించి, రైలింగ్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బలవంతపు రిటైర్మెంట్ ఆపాలి

కార్మికశాఖ మంత్రికి శ్యామ్‌పిస్టన్స్ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - రణస్థలం

శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమలో 30 ఏళ్ల సర్వీసు పేరుతో యాజమాన్యం చేస్తున్న బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, ఇలా అక్రమంగా తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. రామచంద్రాపురంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి శ్యామ్‌క్రగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్, ఆర్.ఎస్ నాయుడు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాండింగ్ ఆర్డర్ పేరుతో 30 ఏళ్ళ సర్వీస్ పూర్తయిందని అర్థాంతరంగా కార్మికులను యాజమాన్యం ఉద్యోగాల నుంచి తొలగించి రోడ్డున పెడుతోందన్నారు. కంపెనీ స్టాండింగ్ ఆర్డర్ ఉన్నట్లు కార్మికులకు, యూనియన్‌కు తెలీదని చెప్పారు. ఎక్కడా లేని విధంగా ఐదు నుంచి పదేళ్ల సర్వీసు ఉన్నా, ఇప్పటివరకు 90 మంది కార్మికులను యాజమాన్యం అక్రమంగా తొలగించడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం అన్ ఫెయిర్ లేబర్ ప్రాక్టీస్‌కు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికుల అక్రమ తొలగింపు ఆపి కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకుని కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. మోడల్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం రిటైర్మెంట్ వయసు వరకు కార్మికులను విధుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం జాయింట్ కమిషన్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కార్మికుల సమస్యలపై సంయుక్త సమావేశాలు వేయకపోవడం వల్ల కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని చెప్పారు. వెంటనే విశాఖలో జెసిఎల్‌ను నియమించాలని కోరారు.

రేపు పిజి మిగులు సీట్లకు ప్రవేశాలు

బిఆర్ఎయు రిజిస్ట్రార్ సుజాత

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

2024-25 విద్యా సంవత్సరానికి గానూ పలు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో మిగులు సీట్లకు ఈనెల 29వ తేదీన స్పాట్ అడ్మిషన్లను క్యాంపస్ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ పి.సుజాత తెలిపారు. క్యాంపస్‌లోని పలు విభాగాలకు చెందిన పిజి కోర్సులకు ఆరోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇటీవల అనుమతిచ్చిందని తెలిపారు. ఎపి పిజి సెట్-2024 రాసి అర్హత సాధించని వారితో పాటు ఈ ప్రవేశ పరీక్ష రాయని వారూ తక్షణ ప్రవేశాలకు హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఎం.కాం, లైబ్రరీ సైన్స్, సోషల్ వర్క్, ఎంఇడి, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లోని ఎం.ఎ కోర్సులతో పాటు బయో టెక్నాలజీ, మ్యాథ్స్, అప్లైడ్ మ్యాథ్స్, మైక్రో బయాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలిటకల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఎమ్మెస్సీ కోర్సుల్లోకి తక్షణ ప్రవేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 29న సంబంధిత విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలించి అదే రోజు ఆయా కోర్సులకు సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ ప్రవేశాల ద్వారా సీట్లు పొందిన వారికి ఉపకార వేతనాలు, హాస్టల్ వసతి వంటి సదుపాయాలు వర్తించవని స్పష్టం చేశారు.

అందుబాటులోకి 25 కొత్త బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతో శ్రీకాకుళం 1, 2 డిపోలకు 25 కొత్త బస్సులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ బస్సుల రాకతో ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కొత్త బస్సులను జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు కొత్తగా మరో 42 బస్సులు రానున్నాయని తెలిపారు. ఇంద్ర ఎసి బస్సుతో పాటు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసులు ఇందులో ఉన్నాయన్నారు. త్వరలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మహిళల ప్రయాణానికి ఇబ్బందుల్లేకుండా బస్సుల సంఖ్యను ప్రభుత్వం పెంచుతుందన్నారు. గత ప్రభుత్వం బస్సు కొనుగోలు చేయలేదని, మరమ్మతులకు గురైన బస్సులతో సర్వీసులు నడిపి ప్రయాణికులను అవస్థలకు గురిచేసిందని విమర్శించారు. రానున్న కాలంలో ఆర్‌టిసిని బలోపేతం చేసి ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి విజయ్ కుమార్, డిపో మేనేజర్లు శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు లక్ష్మీనర్సుపేట మండలం రావిచంద్రి జంక్షన్ వద్ద యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.వి.హేమలత, కె.లక్ష్మి మాట్లాడుతూ కొత్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో విధుల్లో ఉంటూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్ ఇటీవల అనారోగ్యంతో మరణించారని, రాష్ట్రప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లేక అంగన్వాడీ కార్యకర్తలు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన అంగన్వాడీ కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.20 వేలు ఇవ్వాలని, గత సమ్మెకాలంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలకు రాష్ట్ర ప్రభుత్వం జిఒలు విడుదల చేయాలని, కొత్తూరు ప్రాజెక్టు పరిధిలో ఇటీవల మరణించిన అంగన్వాడీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని, అర్హులైన వారి కుటుంబసభ్యులకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లుగా ఉద్యోగం ఇవ్వాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుదీష్ణ, సుభాషిని, నిర్మల, లక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలనాగమ్మ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

బాలనాగమ్మ మృతి ఉద్యమాలకు లోటు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఆదివాసీల హక్కుల కోసం ఎం.బాలనాగమ్మ అనేక పోరాటాలు చేశారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, కె.సూరయ్య అన్నారు. ఆమె మృతి ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. మండలంలోని పెద్దమడిలో బాలనాగమ్మ కుటుంబ సభ్యులను బుధవారం వారు పరామర్శించారు. సంతాపం తెలిపి ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆదివాసి గిరిజనహక్కుల కోసం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని చేసిన పోరాటంలో కీలకపాత్ర వహించారన్నారు. బాలనాగమ్మ నిర్బంధాలు సైతం లెక్క చేయకుండా గిరిజన హక్కులు కోసం పోరాడారన్నారు. మహిళలు ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి, మహిళల హక్కుల కోసం కృషి చేశారని తెలిపారు.

పూడికతీతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కాలువల పూడికతీత పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు నీటి కాలువల పరిస్థితిని ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పరిశీలించారు. మురుగునీరు రోడ్లపైకి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలే కాలువల్లో పెద్దఎత్తున పూడికతీత పనులు చేపట్టినా, కొన్నిచోట్ల మురుగునీరు సాఫీగా వెళ్లడం లేదన్నారు. ఆయన వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్, మున్సిపల్ ఇంజినీరు దక్షిణామూర్తి, టిడిపి నాయకులు రెడ్డి గిరిజా శంకర్ పాల్గొన్నారు.

వికలాంగునికి ఎమ్మెల్యే భరోసా

విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం రూరల్ మండలం గొల్లపేటకు చెందిన వికలాంగుడు రాము పెన్షన్ కోసం అభ్యర్థించాడు. శతశాతం వైకల్యం ఉన్నప్పటికి పెన్షన్ ఇవ్వడం లేదని వివరించాడు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కొత్త పెన్షన్ల జాబితాలో ఆయన పేరు చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

వసతిగృహాల్లో సదుపాయాలు కల్పించాలి

టెక్కలి: ఎస్‌సి, ఎస్‌టి వసతిగృహాల్లో విద్యార్థుల చదువుల నిమిత్తం మౌలిక సదుపాయాలు కల్పించాలని అదేవిధంగా విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపర్చాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం. కృష్ణమూర్తి ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ డివిజన్‌స్థాయి సమావేశం బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు స్వర్గధామాలు ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని తహశీల్దార్‌కు సూచించారు. అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసులకు ఆదేశించారు. మండల విద్యాశాఖాధికారి దల్లి తులసీరావు రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులపై వ్యవహరిస్తున్న శైలిని మార్చుకునేలా చూడాలని సంఘ నాయకులు ఆర్‌డిఒను కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సమావేశంలో డివిజన్‌లోని 9 మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎటిడబ్ల్యుఒ ధనలక్ష్మి, ఎఎస్‌డబ్ల్యుఒ విజయలక్ష్మి, దళిత సంఘ నాయకులు చల్లా రామారావు, బోకర నారాయణరావు, గేదెల రమణమూర్తి, బెలమర ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం గజపతి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

పర్లాకిమిడి: సిపిఎం గజపతి జిల్లా మహాసభలు పర్లాకిమిడి సిపిఎం కార్యాలయంలో బుధవారం ముగిశాయి. ఒడిశా రాష్ట్ర కార్యదర్శి హులి పట్నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గజపతి జిల్లా బాధ్యులు దుస్మంత్ బెహరాతో పాటు పలువురు ప్రతినిధులు హాజరయ్యారు. సిపిఎం జిల్లా కార్యదర్శిగా బంగారయ్య ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా దొండపాణి రైతో, ముచ్చి బంగారయ్య, మొహితో మిషాల్, గోకుల్ బెహరా, సిమెంద్ర సబర్, కొండింగి సంజీవ్, నాగేష్ సబర్‌లు ఎన్నికయ్యారు.

బాల్య వివాహాలను నివారించాలి

కవిటి : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

కోటబొమ్మాళి : న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జడ్జి

ప్రజాశక్తి- కవిటి

బాల్య వివాహాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చట్టబద్ధ వివాహ వయసు పూర్తయ్య వరకు బాలికలకు వివాహం చేయరాదని బాల్యవివాహాలు అరికట్టేందుకు అందరు సహకరించాలని తహశీల్దార్ మురళీమోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలు, ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కిశోరీ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులైన యువతీయువకులతో పాటు తమ తల్లిదండ్రులను సైతం చైతన్య పరిచే బాధ్యత చదువుకున్న బాలికలదేనన్నారు. బాల్య వివాహాలతో ఆరోగ్యం దెబ్బతింటుందని, వాటిని అరికడితే ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చున్నారు. అనంతరం మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.హరి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పల్లవి, ఎన్‌ఎస్‌ఎస్. పిఒ జె.పాపారావు, కిశోర్ బాలికా కన్వీనర్ డి.అనసూయ, కె.కరుణశ్రీ, జి.విష్ణుమూర్తి, కె.ఉగాదినాయుడు, బి.శ్రీనుబాబు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం, ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ రోణంకి వెంకటరావు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు, ఎంఇఒ గెడ్డాపు రాజేంద్రప్రసాద్, మండల పరిషత్ ఎఒ వాసుదేవరావు, ఐసిడిఎస్ పిఒ ఎస్.అనురాధ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పి.లక్ష్మీబాయ్, లీలారాణి, మండల పరిషత్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రెవెన్యూ కార్యాలయంలో బాల్య వివాహాలపై తహశీల్దార్ వెంకటరావు, ఐసిడిఎస్ పిఒ నాగరాణి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

పలాస: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి యు.మాధురి అన్నారు. జూనియర్ కళాశాలలో బాల వివాహ్ ముక్తా భారత్‌లో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, న్యాయవాదులు పి.జె.రాజారత్నం, బికెఆర్ పట్నాయక్, ఎల్.చంద్రశేఖరరావు, బి.రవికుమార్, కె.రజనికుమార్, జి.ప్రభాకర్, టి.శ్యామ్, బి. కాళిదాసు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బాడ వెంకటమోహన్, లైబ్రేరియన్ పి.చిరంజీవులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన ఏర్పాటు చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి కోరారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, న్యాయవాదులు ఆనందరావు, కళాశాల ప్రిన్సిపాల్ బి.ఈశ్వరమ్మ, ఎస్‌ఐ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కొత్తూరు : మాట్లాడుతున్న జడ్జి రాణి

కొత్తూరు: తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయరాదని స్థానిక జూనియర్ కోర్ట్ జడ్జి కె.రాణి అన్నారు. సిరుసువాడలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.అప్పారావు, న్యాయవాదులు సుధాకర్, ధర్మారావు, సిఐ ప్రసాద్, ఎస్‌ఐ మహమ్మద్ అమీర్ ఆలీ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బిఎంఆర్ ప్రసన్న లత అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్డులో కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది జలుమూరు, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

మెళియాపుట్టి : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పోలాకి

వ్యవసాయ మార్కెటింగ్‌లో దళారీ వ్యవస్థ నిర్మూలించి లాభసాటి వ్యవసాయం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం వెదుళ్లవలస ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల మాటలు నమ్మవద్దన్నారు. ప్రభుత్వం సాధారణ రకం 80 కేజీల బస్తా రూ.1840 మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఈ ఏడాది సాగునీరు, ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం కృషి చేసిందన్నారు. రైతులు కూడా వ్యవసాయ రంగంలో మెలుకువలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి త్రినాథరావు, ఎడిఎ రవీంద్ర భారతి, ఎఒ చిరంజీవి, సిఇఒ బంటుపల్లి రాంబాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఎం. వెంకట అప్పలనాయుడు, మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, మాజీ జెడ్‌పిటిసి రామన్న, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని మర్రిపాడు సి పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, వ్యవసాయశాఖ ఎడి లింగాల మధుబాబు, ఎఒ దానకర్ణుడు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, మాజీ ఎంపిపి ఎస్. మోహనరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, సర్పంచ్ అనూరాధ, లలిత కుమారి, లక్ష్మీనారాయణ, శ్రీధర్, ఎం.వాసు పాల్గొన్నారు.

పోలాకి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కొత్తూరు: మండలంలోని మెట్టూరు రైతు సేవా కేంద్రంలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీ వర ప్రసాదరావు, టిడిపి నాయకులు అగతముడి భైరాగినాయుడు, అరుణ్‌కుమార్, మాతల గాంధీ, మాధవరావు, పొత్తరకొండ మోహనరావు, శ్రీనివాసరావు, సంజీవరావు, అమర్, దాసు నాయుడు, రామకృష్ణ, దశరథ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పులి సంచారం!

మందస: మండలం సాబకూట పంచాయతీ బుడంబో గ్రామ సమీపాన పెద్దపులి సంచరించడం కలకలం రేపుతుంది. మదన్మోహన్ బెహరా అనే వ్యక్తి మందస వెళ్లి తిరిగి ప్రయాణంలో చినబరంపురం మీదుగా బుడంబో వెళ్లే మార్గాన పులిని చూసినట్టు బెహరా సాబకోట పంచాయతీకి వెళ్లి సచివాలయ సిబ్బందితో చెప్పటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు.

మాట్లాడుతున్న ఎఒ దుర్గాప్రసాద్

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

కవిటి: అల్పపీడనం నేపథ్యంలో రాబోయే నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలం చిన్నకర్రివానిపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వాతావరణం అనుకూలతలు చూసుకొని రైతులు కోతలు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రబీ పంటకు కావాల్సిన రాగి, మినుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికైన సభ్యులకు అభినందనలు

పోలాకి : ఇటీవల మందసలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలాకి మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ సుసరాంలో ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేస్తున్న బమ్మిడి శ్రీరామమూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్‌గా ఎంపిపిఎస్ గుళ్ళవానిపేటలో పనిచేస్తున్న పి.ఉమాభాస్కర్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై మండలశాఖ గౌరవ అధ్యక్షుడు వెంకటరమణ, అధ్యక్షుడు రాజేష్, మండల నాయకులు శ్యామ్, కృష్ణారావు, సింహాచలం, సునీల్ గౌతమ్, గణేష్ హర్షం వ్యక్తం చేశారు.

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వసంత కుమార్

ప్రజాశక్తి- పలాస

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యతని ఎంపిడిఒ కె.వసంత కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఐసిడిఎస్ పిఒ కె.పార్వతి అధ్యక్షతన నిర్వహించిన కిషోర వికాసం మండలస్థాయి శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషోర బాలికల్లో వచ్చే శారీరక, మానసిక మార్పులను అవగాహన చేసుకునేలా వారిని దృఢమైన వ్యక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లితండ్రులు, ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామస్థాయిలో డ్రాపౌట్లు గుర్తించి చదువు గొప్పతనం వివరించాలన్నారు. అంగన్వాడీ, విద్య, వైద్య, మహిళా పోలీసు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, వెట్టి చాకిరీ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, రెంటికోట వైద్యాధికారి సునీల్ కుమార్, సూపర్‌వైజర్లు పి.గంగమ్మ, ఎస్.సరస్వతి, యు.లత, ఆర్.ధనలక్ష్మి, సిహెచ్ దానమ్మ పాల్గొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని మదర్ వాలంటర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఎం.భాస్కరరావు తెలిపారు. బుధవారం ఇచ్ఛాపురం శ్రీవెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో వికలాంగుల కృత్రిమ అవయవాలు 18 మంది వికలాంగులకు కొలతలు తీసుకున్నారు. పలువురు వికలాంగులు యుడిఐడి కార్డులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ వికలాంగుల చట్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై వివరించారు. గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లారెడ్డి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఢిలేశ్వరరావు, దుర్యోధన, పరశురాం, మోహనరావు పాల్గొన్నారు.

వికలాంగుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న ప్రతినిధులు

విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ గోపీబాల

నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు

ప్రజాశక్తి- కవిటి

రహదారి నిర్మాణంలో నిధులు దుర్వినియోగం జరిగినట్టు కపాసుకుద్ది పంచాయితీ నుంచి కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం డిఎల్‌పిఒ ఆర్.గోపీబాల బుధవారం సాయంత్రం దర్యాప్తు చేశారు. రహదారి నిర్మాణానికి సంబంధించి రికార్డులు పరిశీలించి సంబంధిత వ్యక్తులతో మాట్లాడి సమాచారం సేకరించారు. అనంతరం కవిటి సచివాలయం సందర్శించి స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి డేటా ఎంట్రీ వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్ రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఇఒ వీరభద్ర స్వామి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొందూరు బాబూరావు, అమరావతి దంపతులు

బోధనకు కేరాఫ్ బాబూరావు

ప్రజాశక్తి - సోంపేట

భావి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుంది. అంకిత భావం, నీతి, నిజాయతీ, నిబద్ధతతో పనిచేసే గురువులకు ఎనలేని గౌరవం ఉంటుంది. ఆ కోవకు చెందిన వారే మండలంలోని కర్తలిపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పొందూరు బాబూరావు. 36 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో విద్యా బోధనలో తనదైన శైలితో విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి, ఎందరినో ఉన్నత స్థానాలకు వెళ్లేలా చేసిన ఆయన ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉపాధ్యాయ వృత్తికే పరిమితం కాకుండా సామాజిక కార్యక్రమాల్లోనూ ముందువరుసలో నిలిచి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

మండలంలోని కర్తలిపాలెంలో 1962 నవంబరు 25న కే.శే పొందూరు బంకులు, పార్వతమ్మకు జన్మించిన ఆయన గ్రామంలోని సమితి పాఠశాలలో ఐదో తరగతి వరకు చదివారు. ఆరు, ఏడు తరగతులు రంగోయి ప్రాథమికోన్నత పాఠశాల, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు బారువ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించారు. సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో ఎం.ఎ ఎడ్యుకేషన్, ఎం.ఎ హిస్టరీ, ఎం.ఎ ఇంగ్లీష్ లిటరేచర్‌తో పాటు పిజి డిప్లమో చేశారు. 1989లో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా మందస మండలం, కమలాపురం ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగంలో చేరారు. సరియాపల్లిలో, సోంపేట మండలం జగతికేశపురం ప్రాథమిక పాఠశాలలో 1998 వరకు పనిచేశారు. 1998 నుంచి 2009 వరకు మండల రిసోర్స్‌పర్సన్‌గా డిపిఇపి, సర్వశిక్ష అభియాన్‌లో పనిచేశారు. 2009 నుంచి 2017 వరకు సోంపేట మండలం పాలవలస ఉన్నత పాఠశాలలో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించారు. 2017 నుంచి నేటివరకు సోంపేట మండలం కర్తలిపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఆయన పనిచేసిన ప్రతిచోటా వెనుకబడిన విద్యార్థుల కోసం అదనపు తరగతులు నిర్వహించేవారు. మండల రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న సమయంలో కర్తలిపాలెంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకు తనవంతు కృషి చేశారు. 1993 నుంచి 95 వరకు ఆలిండియా రేడియోలో ప్రసంగించడంతో పాటు విద్యా సంబంధిత కార్యక్రమాల్లో శిక్షకునిగా వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ మండల రిసోర్స్‌పర్సన్‌గా రెండు పర్యాయాలు, ఉత్తమ మోటివేటర్‌గా ఒకసారి అవార్డులు పొందారు. వీటితోపాటు జిల్లా, మండల స్థాయిలో స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రశంసలు, సత్కారాలు పొందారు. ఆయనకు భార్య అమరావతి, కుమారులు యోగేష్, మహేష్ ఉన్నారు. ఆయన సోదరుడు పొందూరు గున్నయ్య న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సర్పంచ్‌గా రెండు పర్యాయాలు పనిచేశారు.

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని పెంట ఊరులో దేవాలయంలో అర్చకునిగా పనిచేస్తున్న రవి రామాచార్యులు (38) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల మేరకు ప్రతిరోజులాగే దేవాలయంలో పత్రి, పువ్వులు పూజించిన తర్వాత వాటిని రెండవ రోజు చెరువులో వేస్తూ ఉంటారు. అయితే మంగళవారం రాత్రి చెరువులో వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో మునిగిపోయాడు. అక్కడ ఎవరూ గమనించక పోవడంతో మృతి చెందాడు. మృతుడు సోదరి రంగమణి ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ఆస్పత్రికి తరలించారు.

స్వాధీనం చేసుకున్న సామగ్రి

బెల్లం ఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో రింపి గ్రామంలో బుధవారం టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, ఎక్సైజ్ సిబ్బంది నాటుసారా ఊటలపై విస్తృత దాడులు చేసి 900 లీటర్లు పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు టెక్కలి ఎక్సైజ్ సిఐ మీరా సాహెబ్ తెలిపారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం అంది ఇవ్వాలన్నారు. నాటుసారా తయారీదారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట ఎస్‌ఐలు సత్యనారాయణ మూర్తి, గురుమూర్తి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులున్నారు.

నకిలీ పోలీసుల దారిదోపిడీ

కోటబొమ్మాళి: మండలం కన్నేవలస గ్రామ సమీపంలో వంశధార వంతెన వద్ద బుధవారం సాయంత్రం పోలీసునని చెప్పి ఇద్దరు వ్యక్తుల వద్ద గుర్తు తెలియని వ్యక్తి దారిదోపిడీకి పాల్పడ్డాడు. ట్రాక్టర్ టైరు పంచరు కావడంతో పంచరు వేసుకొనేందుకు రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా టాక్టర్‌ను ఆపి ఫైన్ కట్టాలని టాక్టర్ డ్రైవర్ ధర్మాన అచ్చుతరావును డిమాండ్ చేయటంతో తన వద్ద డబ్బులు లేవని, రూ.100లు మాత్రమే ఉందని నకిలీ పోలీసుకు ఇచ్చి అక్కడనుంచి తప్పించుకున్నాడు. అలాగే కన్నేవలస రోడ్డులో గ్రామానికి సైకిల్‌పై వెళ్తున్న గ్రామానికి చెందిన రైతు పాగోటి కోదండరావును ఆపి జేబులో పర్స్ తీసి ఇమ్మని చెప్పగా పోలీసే కదా పరిశీలించి ఇస్తాడని పర్సును చూపించగా వరిచేను కోసిన కూలీలు కోసం తీసుకువెళ్తున్న రూ.10 వేలు నగదును పర్సులో నుంచి తీసుకొని, ఖాళీ పర్సును కోదండరావు చేతిలో పెట్టి అక్కడనుంచి తన స్కూటీలో వెళ్లిపోయాడు. పోలీస్ అని చెప్పి తన పర్సును చేతిలో పెడితే నమ్మించి గొంతు కోశాడని కోదండరావు లబోదిబోమంటున్నాడు. ఈ విషయంపై కోదండరావు, టాక్టర్ డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న లేఅవుట్ల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో బుధవారం విజిలెన్స్ అధికారులు జగనన్న లేఅవుట్లను తనిఖీ చేపట్టారు. విజిలెన్స్ అధికారి అప్పన్న ఆధ్వర్యంలో మండలంలోని 17 పంచాయతీల పరిధిలో ఉన్న కొల్లివలస, గుత్తావల్లి, తుడ్డలి, అల్లెన తదితర గ్రామాల్లో ఇటీవల నిర్మాణం చేపట్టిన జగనన్న గృహాలను తనిఖీ చేయడమే కాకుండా పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు. 17 లేఅవుట్లుకు సంబంధించి 1080 గృహాలు మంజూరు కాగా అందులో అధికారులు గురువారం వందకుపైగా గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారులతో మాట్లాడుతూ వివరాలను తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎఇ లక్ష్మీనారాయణ, రాంప్రసాద్, మదన్ మోహన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అభినందిస్తున్న డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

విప్‌కి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- సోంపేట

ప్రభుత్వ విప్‌గా ఎన్నికైన అనంతరం స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం ఎమ్మెల్యేని ఆయన కార్యాలయంలో కొర్లాం జాగృతి అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి తదితరులు కలిసి అభినందించారు. ఆయనతో పాటు ఆర్. వెంకటరమణ, టి.వాసుదేవరావు, ఎస్.ఢిల్లీరావు, పి.సోమేశ్వరరావు, ఎస్.రామస్వామి, పి.మోహనరావు, ఆర్.గంగారావు, పి.రాజేష్, ఆర్.ఉమామహేశ్వరరావు కలిశారు. అలాగే పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు డాక్టర్ వై.కృష్ణమూర్తి, బార్ల సుందరరావు, శ్రీరామమూర్తి, వి.నాగు, వెంకన్నలు కలిసి అభినందించారు. 329 జిఒ రద్దుతో పాటు ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేసేందుకు కృషి చేయాలని కోరారు.

పోస్టాఫీస్‌లో చోరీకి విఫలయత్నం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. బుధవారం ఉదయం కార్యాలయం తెరిచే సరికి బీరువా తెరిచి కాగితాలు చిందర వందరగా పడి ఉండడం గమనించిన సిబ్బంది పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరణ చేశారు. చోరీకి ప్రయత్నం జరిగిందని, ఏమి పోలేదని గుర్తించి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణ ఎస్‌ఐ చిన్నం నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించబడునని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐదు బహుళజాతి ప్రైవేట్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని పదవ తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువత సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి- పలాస

మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, అందులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో 8, ఎఫ్‌పిఒ ఆర్ట్స్ ఉద్దానం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, వ్యవసాయశాఖ ఎఒ కిల్లి పోలారావు చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం పిఎసిఎస్, వ్యవసాయశాఖ అధికారులు, రెవెన్యూ, సివిల్‌సప్లై అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 10,277 ఎకరాల్లో వరిసాగు చేయగా 9668 ఎకరాల్లో ఇకెవైసి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 2120 ఎకరాల్లో కోతలు జరగ్గా సుమారు 4240 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పిఎసిఎస్ సిఇఒ శ్రీనివాసరావు, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మురళీ, ఇన్‌ఛార్జి ఆర్‌ఐలు కంచరాన ఖగేష్, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి- పలాస

విశాలాంధ్ర పుస్తకాలయం విజ్ఞాన భాండాగారమని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కాశీబుగ్గ సిఐ డి మోహనరావు అన్నారు. కాశీబుగ్గ ఆంధ్రాబ్యాంకు రోడ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సంచార విశాలాంధ్ర పుస్తకాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర పుస్తకాలయంలో అనేకమంది కవులు, రచయితలు రాసిన పుస్తకాలతో పాటు మహాభారతం, రామాయణం వంటి ఇతిహాసాలు, పిల్లల పుస్తకాలు, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర పుస్తకాలు లభ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సవర సోమేష్, సిపిఐ నాయకులు చాపర సుందర్‌లాల్, చాపర వేణుగోపాల్, మేనేజర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఉపాధ్యాయులు

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని డోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.వరలక్ష్మి అన్నారు. బుధవారం కౌశల్ 2024 టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి అర్హత సాధించిన పదవ తరగతి విద్యర్థిని గీతా పావనిని బహుమతితో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించడానికి టాలెంట్ టెస్ట్ నిర్వహించారని తెలిపారు. ప్రతి విద్యార్థి నిజ జీవితంలో జరిగే సంఘటనలను శాస్త్రీయ దృక్పథంతో అన్వయించి సరిపోల్చాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం సాయం అందజేస్తున్న యువకులు

డెలివరీ బాయ్‌కు ఆర్థికసాయం

శ్రీకాకుళం అర్బన్ : రోడ్డు ప్రమాదంలో కుడి కాలికి గాయపడిన కిల్లిపాలెంకు చెందిన ఫ్లిప్‌కార్టు డెలివరీ బాయ్ అలబాన చిన్నారావుకు పెద్దపాడుకు చెందిన యువకులు జనసేన నాయకులు బొట్టా శంకర్ నేతృత్వాన రూ.20 వేలు ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారావు మందుల కోసం డబ్బుల్లేవని అతని తల్లి అభ్యర్థించడంతో యువకులు సాయం చేశారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధాన్యం పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని గంగరాజపురం, పెద్దలక్ష్మిపురం, జగన్నాథపురంలో రైతులు నూర్పు చేసిన ధాన్యాన్ని ఎఎఒ ప్రభావతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రైతులు నూర్పు చేసుకున్న ధాన్యాన్ని శుభ్రం చేసి ఆరబెట్టుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి సిబ్బంది వచ్చి ధాన్యాన్ని పరీక్షలు జరిపి గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుకు షెడ్యూల్ ఇస్తారన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు ఏజెన్సీ సిబ్బంది రైతుకు నచ్చిన మిల్లుకి ట్రక్‌షీట్ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, సర్పంచి ప్రతినిధి కోళ్ల శంకరావు, మాజీ సర్పంచ్ వాకాడ గంగారత్నం, ఢిల్లీరావు, విఎఒ సూర్య, రైతులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుకు కనీస సౌకర్యాలు కల్పించాలి

శ్రీకాకుళం అర్బన్ : సోంపేట మండల కేంద్రంలోని పోస్టాఫీసుకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బిసి సంక్షేమ సంఘం ప్రతినిధులు బీన ఢిల్లీరావు, అమీరుల్లా బేగ్, న్యాయవాది చౌదరి లక్ష్మణరావు తెలిపారు. నగరంలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పిఎస్ వండాన హరిబాబును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పోస్టాఫీసుకు వచ్చే వారికి సకాలంలో సేవలు అందడం లేదని చెప్పారు. సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు చేపట్టాలని కోరారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

నౌపడ : మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ స్వామి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాలి మండలం పెద్దమర్రిపాడులో బుధవారం నౌపడ ఎస్ఐ నారాయణ స్వామి ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా అపరిచిత వ్యక్తులు అడిగిన బ్యాంకు అకౌంటు, ఆధార్, పాన్, ఎటిఎం వంటి వివరాలు చెప్పకూడదన్నారు. తెలియని లింకులపై క్లిక్ చేసి ఆన్‌లైన్ మోసాల బారిన పడకూడదని, మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగంపై సమాచారం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ జి.లక్మణరావు అన్నారు. బుధవారం లింగాలవలసలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా మత్తుపదార్థాల వాడకంపై కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువత జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. బుధవారం పాత టెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలతో యువతకు ప్రమాదం పొంచి ఉందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకూడదన్నారు..లైంగిక దాడులకు పాల్పడిన వారికి అత్యంత కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. డగ్స్ రహిత ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటుకు అందరూ కృషి చేయాలన్నారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు : మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

పాతపట్నం: సంకల్పం కార్యక్రమంలో భాగంగా పాతపట్నం సిఐ వి.రామారావు ప్రభుత్వ బిసి వసతిగృహంలో విద్యార్థులకు మత్తుపదార్థాలపై అవగాహన కల్పించారు.

జగన్మోహన్ రెడ్డిని కలిసిన సాయికుమార్

జగన్మోహన్ రెడ్డిని కలిసిన 'పిన్నింటి'

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డిని ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ తాడేపల్లిలోని నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని, అనంతరం ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పలు గ్రామాల్లో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం మండలంలోని వైకుంఠపురంలో చెరువులో చేప పిల్లలను విడిచిపెట్టే కార్యక్రమంలో పాల్గొంటారని, అలాగే ఉప్పినివలసలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలకు నగరపాలక సంస్థ ప్రజారోగ్యాధికారి పి.సుధీర్‌కుమార్, పశుసంవర్ధకశాఖ వైద్యుల సహకారంతో యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుదవారం చేపట్టారు. ఒక్కరోజున సుమారు 200లకు పైగా కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చిలకపాలెం, ఎచ్చెర్ల రహదారిలో డాగ్‌స్క్వాడ్ బృందం పోలీసు సిబ్బందితో కలిసి పోలీసు జాగిలంతో వాహన తనిఖీలు చేసి అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని, పాన్‌షాపులు, ప్రైవేట్ ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయాలు క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలు అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

మండలం బెలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడమే కాకుండా పాఠశాల ఆవరణలో ప్రత్యక్షంగా దాన్ని చేసి చూపించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఎటిఎం మోడల్ పద్ధతిని అనుసరించి నాలుగు అడుగుల బెడ్ తీసుకొని, అందులో ఒక అడుగు వెడల్పు కాలువ ఏర్పాటు చేసి దాంట్లో ఘనజీవామృతం, ముందుగా తయారు చేసుకున్న బీజామృతంతో నార శుద్ధి, విత్తనాల శుద్ధి చేసి కూరగాయలు, ఆకుకూరలు, తీగ జాతి, దుంప జాతికి చెందిన పంటలు వేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నమిత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండిస్తే నేల సారవంతమై, అధిక దిగుబడులతో పాటు ఆరోగ్యమైన ఆహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు కృష్ణారావు, ప్రకృతి వ్యవసాయం ఇన్‌ఛార్జి తలసయ్య, చిట్టిబాబు, ఐసిఆర్ పి.స్వాతి, సంతోషి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు నాటుతున్న సిబ్బంది

మత్స్య ఉత్పత్తిదారుల సమాఖ్య ఏర్పాటుపై అవగాహన

మాట్లాడుతున్న గురునాథరావు

ప్రజాశక్తి- పోలాకి

మత్స్య ఉత్పత్తిదారుల సమాఖ్య ఏర్పాటుపై మత్స్యశాఖ ఉన్నతాధికారి, డిప్యూటీ డైరెక్టర్ పిట్టా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డోల, జనవానిపేట స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు దువ్వారపు గురునాథరావు ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురునాథరావు మాట్లాడుతూ సొసైటీలో 100 మంది సభ్యులు ఒక గ్రూపుగా ఏర్పడి ప్రతిఒక్కరూ రూ.2 వేలు షేర్‌ధనంగా బ్యాంకులో డిపాజిట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా అదే మొత్తంలో మరలా రూ.2 లక్షలు సొసైటీకి అందించడం జరుగుతుందన్నారు. ఈ మొత్తం సొమ్ము గ్రూపు సభ్యులు వ్యాపారాలు చేసుకునొ లాభాలు అందరూ పంచుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం మత్స్యశాఖ సహాయ సంచాలకులు టి. సంతోష్ కుమార్, నరసన్నపేట మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బాగాది సురేష్ కుమార్, కేంద్ర ప్రభుత్వ మత్స్యశాఖ రాష్ట్ర పరిశీలకులు దోమ చిట్టి నాయుడు, పోలాకి మండల మత్స్యశాఖ సహాయకులు హెచ్. ఢిల్లేశ్వరరావు వివరించారు. మత్స్యకార సొసైటీ కార్యదర్శి జనా రమణ, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గోవిందపురం పంచాయతీలో రెయ్య వసంత రెడ్డి, రెయ్యమ్మ దంపతల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు పలువురికి ఆర్థికసాయం, నిత్యవసర వస్తువులు బుధవారం అందజేశారు. గోవిందపురం గ్రామానికి చెందిన నిరుపేద మర్ల సవరయ్య గుండెకు రెండు స్టంట్స్ పడిన కారణంగా ఆ కుటుంబానికి రూ.11 వేలు ఆర్థికాసాయం, వల్లేవలసకు చెందిన కోటికి ఆరోగ్యం బాగోలేని కారణంగా రూ.5 వేలు ఆర్థికసాయం, 10 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్, కుటుంబసభ్యులు

కార్యక్రమంలో గోవిందపురం సర్పంచ్ రెయ్య రామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, నీలకంఠ రెడ్డి, శంకర్ రెడ్డి వీటిని అందజేశారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాలి

ఆమదాలవలస: రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు చాలా వరకు పంటకోతలు పూర్తిచేసి ధాన్యం బస్తాలను పొలాల్లో పెట్టుకుని ఉన్నారని, ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటం రైతులను నిర్లక్ష్యానికి గురిచేయటమేనన్నారు. వైసిపి హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో జిల్లాలో నవంబరు 2న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం నవంబరు నెల పూర్తికావస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోలు

రవికుమార్

కేంద్రాలను ప్రారంభిం చక పోవటం శోచనీయమన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించక పోవడంతో రైతులు తక్కువ ధరలకే దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేపటి నుంచి తుపాను ప్రభావం జిల్లాపై ఉంటుందని అధికారులు ప్రకటన విడుదల చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని, దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంద న్నారు. వ్యవసాయ శాఖామంత్రి జిల్లాకు చెందిన వ్యక్తి అయినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించ కపోవడం బాధాకర మన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

ఆర్ట్స్ కళాశాలకు పూర్వ విద్యార్థి రూ.లక్ష వితరణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1982-85 విద్యా సంవత్సరంలో బి.ఎస్.సి పూర్తి చేసి ప్రస్తుతం హైదరాబాద్ లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్‌లో ప్రిన్సిపాల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.వి సాయిప్రసాద్, కళాశాలకు రూ.లక్ష వితరణ అందజేశారు. ఆ మొత్తాన్ని డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో ఏటా కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థికి వార్షికోత్సవం నాడు తన తండ్రి సాకూరు వెంకటరమణ మెమోరియల్ అవార్డు పేరిట నగదు బహుమతిగా అందజేయాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

రికార్డులను తనిఖీ చేస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలో కృష్ణాపురం సచివాలయం-2, మోణింగివారి వీధి- 1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కృష్ణాపురం సచివాలయంలో కార్యదర్శుల హాజరు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించనందున మెమోలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన సర్వేలు, ఎన్‌పిసిఐ బ్యాంక్ అకౌంట్లకు యాక్టివేట్ చేయడం, అపార్, ఆధార్ డేటా సవరించడం వంటి సర్వేలను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పురపాలక సంఘ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ ఉత్పత్తులకు గిరాకీ

ప్రజాశక్తి- సోంపేట

బహిరంగ మార్కెట్‌లో సేంద్రీయ ఉత్పత్తులకే గిరాకీ ఎక్కువ ఉందని వ్యవసాయ శాఖ ఎడిఎ జగన్మోహనరావు, ఎఒ నరసింహమూర్తి అన్నారు. మండలంలోని పొత్రకొండలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ ప్రియమైన సాగు పద్ధతులను రైతులు పాటించాలని సూచించారు. సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేసే ఉత్పత్తులకు అధిక ధరతో పాటు గిరాకీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్కే స్వచ్ఛంద సంస్థ

మాట్లాడుతున్న ఎడిఎ జగన్మోహనరావు

ఇఒ ప్రియాంక, రైతులు విశ్వనాథం, సోమేష్, షణ్ముఖరావు, జగన్నాథరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నికుల చైర్మన్‌ను కలిసిన 'కుత్తుం'

ప్రజాశక్తి- పలాస

విజయవాడ బి.సి వెల్ఫేర్ కార్యాలయంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రసాదరావును బుధవారం మండల టిడిపి అధ్యక్షుడు, గురుదాసుపురం సర్పంచ్ ప్రతినిధి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుం లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు ప్రమాణ స్వీకారం చేపట్టిన సందర్భంగా ఘనంగా

పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మణ్‌కుమార్

సన్మానించారు. ఆయనతో పాటు కార్ని రమణ, జి.పాపారావు పాల్గొన్నారు.

చాకచక్యంగా పట్టుకున్న కొండచిలువ

ప్రజాశక్తి- పలాస

కోసంగిపురం జాతీయరహదారి వద్ద నిర్మాణంలో ఉన్న టిట్కో గృహ సముదాయంలో 12 అడుగులు పొడవు భారీ కొండచిలువ చొరబడింది. బుధవారం ఉదయం ఈస్ట్రన్‌గాడ్స్ వైల్డ్ లైఫ్ సభ్యుడు ఓంకార్ రెడ్డి, అటవీశాఖ అధికారులు అనకొండను చాకచక్యంగా బంధించి సమీప అడవిలో సురక్షితంగా విడిచిపెట్టారు. కొండచిలువ మంగళవారం రాత్రి టిక్కో గృహాలు వద్ద పనిచేస్తున్న సిబ్బందికి తారాసపడింది. దీంతో వారంతా కేకలు వేసి పరుగులు పెట్టారు. దీంతో ఆ భారీ కొండచిలువ గృహ సముదా యంలోకి దూరిపోయింది. బుధవారం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అటవీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరకొని పాము ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. అనంతరం అతికష్టంపై దాన్ని బయటకు తీసి ప్రత్యేక గోనెసంచిలో బంధించి సమీప అడవిలో విడిచిపెట్టారు.

పంప్ హౌస్ పరిశీలన

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీరు అందించే పంప్ హౌస్‌ను మున్సిపల్ కమీషనర్ ఎన్.రామారావు బుధవారం పరిశీలించారు. పంప్ హౌస్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చిన్నపాటి వర్షాలకు ముంపుకు గురై ప్రమాదకర పరిస్థితిల్లో ఉండడాన్ని గుర్తించి దీని మార్పుపై ఆరా తీయగా ట్రాన్స్‌ఫార్మర్ వేరొకచోటకు మార్చేందుకు స్థలం గుర్తించి దాని తగ్గ బేస్మెంట్‌ను కూడా ఏర్పాటు చేసినప్పటికీ ఇంత వరకు ఇది మార్పుకు నోచుకోలేదనే విషయం తెలుసుకొని, తక్షణమే ట్రాన్స్‌పార్మర్ మార్పుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ డిఇకి ఆదేశించారు. అదే విధంగా విద్యుత్ అధికారులతో కూడా ట్రాన్స్ ఫార్మర్ మార్పుపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పరిశీలనలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహాల పూర్తికి సహకరించాలి

ప్రజాశక్తి- పలాస

పేదలు నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు మహిళా సంఘ సభ్యులు వారికి సహకరించాలని సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ మల్లేశ్వరరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షులు జి.శాంతమ్మ అధ్యక్షతన ప్రధానమంత్రి అవాస్ యోజన పథకంలో భాగంగా పేదలందరికి ఇళ్ల నిర్మాణానికి సహకరించాలన్నారు. ప్రతి మహిళా సంఘ సభ్యురాలు ఇంటింటికి వెళ్లి వారి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి ప్రోత్సహించాలని, బిల్లులు చెల్లింపులో ఎటువంటి ఇబ్బందులు లేవని తెలియజేయాలన్నారు. ఇంటి నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ ఉపాధ్యక్షులు పార్వతి, కోశాధికారి త్రివేణి, గ్రామాఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆకాశవాణిలో గౌరీశంకర్ కథ

ప్రజాశక్తి- నరసన్నపేట

కథా రచయిత, గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మానేజ్‌మెంట్ తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరీశంకర్ కథ 'మబ్బు చాటు వాన చినుకు' డిసెంబర్ 2న ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో ప్రసారం కానున్నట్టు, కేంద్రం డైరెక్టర్ ఫోన్ ద్వారా తెలిపారని గౌరిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గౌరిశంకర్ ఇంతవరకు వందకుపైగా కథలు, సాహితీ వ్యాసాలు రాశారు. ఏడు సంకలనాలు వెలువరించారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో సభా నిర్వాహకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయనను నరసన్నపేట రచయితల అధ్యక్షులు సదాశివుని కృష్ణ, గాయత్రి విద్యా సంస్థల అధినేత జి.వి. స్వామి నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు, సాహితి మిత్రులు అభినందించారు.

అవార్డు అందుకుంటున్న జయరాం

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని రుంకు హనుమంతు పురం గ్రామానికి చెందిన పొలాకి జయరాం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్టాల్లో లక్షాలది మంది విద్యార్థుల జీవితాల్లో జీవన ప్రమాణాల అభివృద్ధి కోసం కృషి చేసినందుకు కర్మవీర చక్ర అవార్డు ఢిల్లీలో ఈ నెల 26న ప్రిన్సెస్ ఫ్రాంకోయిస్ స్టర్డుజా ఫౌండర్, ప్రెసిడెంట్ హార్ట్ ఫర్ ఇండియా ఫోండేషన్ చేతులుమీదుగా ప్రదానం చేశారు. ఈ అవార్డు దేశంలో సాంఘిక సేవలు చేసిన వారికి ఉన్నతమైన గుర్తింపుగా అందిస్తారు. జయరాం చేస్తున్న యువత ప్రగతికి, స్కూల్ స్థాయి నుంచి విద్యా ప్రమాణాలు పెంపుదల, ఉద్యోగ అవకాశాలు, జీవన ప్రమాణాలు, విద్యా మెరుగుదలకు చేస్తున్న కృషికి గాను కర్మవీర చక్ర అవార్డు నవంబర్ 26న థి శ్రీరామ్ మిలీనియం స్కూల్, ఢిల్లీలో అందిచారు. అలానే కర్మవీర చక్ర గ్లోబల్ యూత్ లీడర్స్ ఫెలోగా గుర్తింపు ఇచ్చారు.

కుప్పలు పెడుతున్న రైతులు

రైతుల పాట్లు

వజ్రపుకొత్తూరు: పంట చేతికొచ్చే సమయంలో రైతులకు పాట్లు తప్పడం లేదు. ఎంతో కష్టపడి పండించుకున్న పంట నీటిపాలు కాకుండా ఎలాగైనా దక్కించుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. తుపాను హెచ్చరికలు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. 28, 29 తేదీల్లో వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు తమ పంటను జాగ్రత్త చేసుకునే పనుల్లో తలమునకలయ్యారు. బుధవారం బెండి, సతాపురం, కొండవూరు, గోవిందపురం తదితర చోట్ల రైతులు కోసిన వరిచేలును మోస్తూ, కొన్నిచోట్ల పొలాల్లోనే వరికుప్పలు పెడుతూ క్షణం తీరిక లేకుండా పనుల్లో నిమగ్నమయ్యారు.

వృత్తి విద్యపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట



స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన కల్పించారు. వృత్తి విద్యా ఉపాధ్యాయులు టి.శ్రావణి విద్యార్థులకు అందం వెల్నెస్ ట్రేడ్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులకు వృత్తి విద్యతోనే ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.